# — నీలి మేడ —

[కథానిక]

— 'ఆత్రేయ' —

ఒకరోజున మేమంతా "ఇలస్ట్రేటెడ్ వీక్లీ"లో బొమ్మలు చూసుకుంటున్నాము. అంతలో అక్కడికి మా పెద్దమామయ్య వచ్చాడు. "చూడు మామయ్యా! ఈ అమ్మాయి ఎంచక్కా నవ్వుతోందో!" అని మా చెల్లెలు సుశీల ఒక బొమ్మ చూపించింది. మా మామయ్య ఆ బొమ్మని చూశాడో లేదో, అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. పెదవులుమాత్రం నవ్వుతూనే ఉన్నాయి. వెంటనే అతడు అక్కడినుంచి వెళ్లి, వసారాలో కుర్చీలో కూర్చుని మాలతిపందిరివైపు చూస్తూ ఏదో ఆలోచిస్తూన్నాడు. నేను దగ్గిరికివెళ్లి, "ఏం మామయ్యా, అల్లా వచ్చేశావేం?" అని అడిగాను. "అబ్బే, ఏం లేదురా, ఏదో జ్ఞాపకంవస్తేను..." అంటున్నాడు. అంత వృద్ధునికి కంట నీరుతిరిగిన విషయం ఏమిటా అని నాకు మరింత కుతూహలం కలిగింది. "చెప్పవూ, మామయ్యా?" అని మరీమరీ అడిగ్గా, చివరికి "అదో కథలే" అంటూ మొదలుపెట్టాడు. మధ్యమధ్య ఏమైనా అడిగితే అసలు కథే మానేస్తాడేమో అని మాట్లాడకుండా కూర్చున్నాను. మా మామయ్య చెపుతున్నాడు.

"నేను వర్తకంకోసం తరుచు మద్రాసు, బెంగుళూరు, బొంబాయిలమధ్య తిరుగుతూ ఉండేవాణ్ణని మీకు తెలుసు ననుకుంటాను. ఒకసారి ఒక చిన్న స్టేషన్‌దగ్గర బండి ఆగింది. అక్కడ స్టేషనుకు దగ్గరగానే ఒక చిన్న అందమైన యిల్లు కనపడింది. ఇంటికంతా నీలిరంగు వేశారు. వానకూ, ఎండకూ రంగు కొంచెం మాసిపోయి ఉంది. చుట్టూ చిన్న తోట ఉంది.

ముప్పైఐదు, నలభైసంవత్సరాల నాటి మాట. రైలులో కూర్చునే ఆ యింటిని చూశాను. నేనున్న పెట్టెకూడా సరిగ్గా ఆయింటిముందరే ఆగింది. అక్కడినుంచే ఆ యిల్లు నా మనస్సులో బాగా నాటుకుపోయింది. ఇంటిముందర తోటలో ఒక చిన్నపిల్ల బంతితో ఆడుకుంటోంది. వయస్సు సుమారు పదిసంవత్సరా లుంటాయి. పచ్చని దబ్బపండులాంటి రంగు, నల్లని పట్టుకుచ్చుల్లాంటి మెత్తని జుట్టు. ఆకుపచ్చ పరికిణీ కట్టుకుని, గులాబిరంగుగౌను తొడుక్కుంది. జుట్టు నీలిరంగు రిబ్బనుతో కట్టుకుంది. వసంతకాలపు వనలక్ష్మి యేమో అన్నట్టుంది. ఆ బాలిక సర్వావయవాలలోనూ ఆనందతరంగాలు ఉప్పొంగిపోతోన్నట్టూ, ఆమె మూర్తీభవించిన ఆనందదేవత అయినట్టూ తోచింది.

ఆ రోజు అసలు నా మనస్సు స్తిమితంగా లేదు. మా నాన్నకు ఒంట్లో బాగుండలేదు. బొంబాయిలో వర్తక విషయాలలో కొన్ని పేచీలు వచ్చాయనీ, తొందరగా రమ్మనీ టెలిగ్రాము వచ్చింది. మా నాన్న నన్ను వెళ్లి ఆ పని చూసుకుని రమ్మన్నాడు. నేను ఆయనతో ఒకటి రెండుసార్లు బొంబాయి వెళ్లినా, సొంతంగా వ్యాపారం చూడ్డం అదే మొదలు. పైగా, నాన్న జబ్బుగా ఉన్నాడు. ఆయనైతే పెద్దవాణ్ణి. మనస్సు అనేకచింతలతో నిండిపోయిఉంది.

అటువంటి సమయంలో ఈచిన్న చిత్రం కాస్సేపు నాబాధంతనీ మరపించింది. ప్రొద్దున్నే కన్నులు తెరవగానే ఎదుట, ప్రకృతినంతనీ తనలో వికసింపజేసుకున్న ఆ చిన్నతోటనీ, ఆ తోటలో వనలక్ష్మిలాగ ఆ బాలికనూ చూడగానే ఎందుకనో ఆ రోజు నేను పట్టినదంతా బంగారం అవుతుందనిపించింది. "ఇటువంటి

ప్రశాంతప్రదేశంలో ఉన్నవారికి ఎంత సుఖంగా ఉంటుందో? వారికి చీకూ చింతా ఉండవలసిన అవసరం ఏమి ఉంటుంది?" అనుకున్నాను. ఈ ఆలోచనలవల్ల ఆ బాలికఆనందం చూస్తే మనస్సులో కొంచెం అసూయ మొలకెత్తింది. ఇదేవిధంగా నేను కూడా అన్ని విచారాలూ మరిచిపోయి విశ్వసౌందర్యంలో తేలిపోతూంటే!

బండి కదిలింది. అదే సమయానికి ఆ నీలిమేడలోంచి ఎవరో "కళ్యాణీ!" అని పిలిచారు. ఆ బాలిక ఆట మానేసి ఇంట్లోకి పరుగెత్తింది.

కళ్యాణి! ఆ పేరుకూడా నాకు ఎంతో మధురంగా వినిపించింది. రైలులో కూర్చుని ఆ నీలిమేడా, ఆ తోటా, ఆ బాలికా, ఆ బంతీ, ఆ పిలుపూ అన్నీ మళ్లీ మళ్లీ జ్ఞాపకం తెచ్చుకోడం మొదలుపెట్టాను.

కొద్దిరోజులకే మానాన్న చనిపోడంవల్ల వర్తకం అంతా నేనే చూసుకోవలసివచ్చింది. అందుచేత చాలా రోజులవరకూ సరుకులూ, రత్నాలూ, డబ్బూ తప్ప నాకు వేరొకచింత లేకపోయింది.

పదిసంవత్సరాల తరువాత మళ్లీ బొంబాయి వెళ్లి తిరిగివస్తున్నాను. నేను కూర్చున్న పెట్టె మళ్లీ నీలిమేడ యెదుట ఆగింది. వెనకటి విషయం జ్ఞాపకంవచ్చింది. ఇప్పుడా మేడరంగు ఇంకా వెలిసిపోయినట్టు ఉంది. ఆ యింటినిగురించి యెవరూ అట్టే శ్రద్ధపట్టడం లేదేమో అనిపించింది.

ఆ తోటలో సుమారు ఇరవైసంవత్సరాల తరుణి ఒకామె కూచుని అప్పుడే విచ్చిన గులాబీపూలు దండ కడుతోంది. జుట్టు గులాబీరంగు రిబ్బనుతో కట్టుకుంది. ప్రక్కనే సుమారు పాతికసంవత్సరాల యువకుడు కూర్చుని మాట్లాడుతూ, నవ్వుతూ ఉన్నాడు. ఆ యువతి బుగ్గలలో గులాబీపూలూ, కళ్లలో సిగ్గుదొంతరలూ వెల్లివిరుస్తోంటే, ఆమె నవ్వుతో జవాబు చెపుతోంది. ఆమె తప్పక కళ్యాణే! సందేహం లేదు. అదే శాంతి! అదే ఆనందం!

ఆ దృశ్యం చూసే నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. బండి కదలడం మొదలుపెట్టగానే నేను హఠాత్తుగా కిటికీలోంచి బయటికి చూస్తూ చెయ్యి ఊపి, "నమస్తే, నమస్తే, కళ్యాణీ!...గుడ్ బై!" అన్నాను నవ్వుతూ.

ఆ యువతి విస్మయభరితాలైన పెద్దపెద్దకళ్లు నావైపు తిప్పింది. ఆ యువకుడు కూడా ఇటు తిరిగాడు. ఒకరివైపు ఒకరు చూసుకుని వారిద్దరూ ఎందుకో విరగబడి నవ్వుకున్నారు. ఇద్దరూ జేబురుమాళ్లు విసిరి నాకు "గుడ్ బై" చెప్పారు. రైలు వెళ్లిపోతూన్నా, నేనుమాత్రం శాంతీ, ఆనందమూ మూర్తీభవించిన ఆ యువతీయువకులవైపే కిటికీలోంచి తొంగి తొంగి చూస్తూ నా సర్వక్లేశలూ మరిచిపోయాను. చాలా దూరంవరకూ వాళ్ల నవ్వు నా చెవులలో ప్రతిధ్వనిస్తోనే ఉంది. వర్తకవ్యవహారభరితమైన నా మనస్సు కొంచెంసేపు స్వచ్ఛమైన ఆనందంతో నిండిపోయింది.

ఇంకా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. బెంగుళూరు, మద్రాసు, బొంబాయిల మధ్య ఎన్నో సార్లు నేను ప్రయాణంచేశాను. కాని, పగ లెప్పుడూ ఆ స్టేషను తగిలే ప్రయాణాలు కావవి. ఎన్నిసార్లు వెళ్లినా, రాత్రి చీకటిలోనో, నిద్రలోనో, రాత్రిరైళ్లు అక్కడ ఆగకపోడంవల్లనో ఆ చిన్నస్టేషను దాటిపోయేది. ఎప్పుడో ఒక్కసారి అటువంటి అదృష్టం కలిగింది. అప్పటికి కళ్యాణిని తన ప్రియుని సమీపాన చూసి యెన్నిసంవత్సరా లయిందో!...పన్నెండో, పదిహేనో—బాగా జ్ఞాపకం లేదు.

ఈ మాటు రైలు ఆ స్టేషనుదగ్గర ఆగగానే కనుపించిన దృశ్యం—ఆ నీలంగా ఉన్న యింటితోటలో ఒక చిన్న కుర్రాడు గడ్డిమీద దొర్లుతూ ఒక పెద్ద కుక్కతో, దాని తోక పట్టుకుని లాగీ, చెవులకు "కీ" పెట్టే ఆడుకుంటున్నాడు. మధ్యమధ్య దాన్ని చూసి కిలకిలా నవ్వుతున్నాడు. అయితే నాకు కళ్యాణి ఒక్కసారి అయినా కనపడదా? నాకు ఎంతో నిరాశ కలిగింది...అంతలో ఆ కుర్రవాడు లేచి చప్పట్లు చరుస్తూ "అమ్మా, అమ్మా! రైలు వత్తింది!" అని అరిచాడు.

అప్పుడు మధ్యవయస్కురాలైన ఒకామె యింట్లోంచి బయటికి వచ్చింది. అదిగో! కళ్యాణే!

కొంచెం లావయింది,-కొంచెం నల్లబడింది. అయితేనేం? ఆమె కళ్యాణే! నేను వెంటనే గుర్తుపట్టాను. ఆమెను చూడగానే నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. వెంటనే నే నెంతో గౌరవంతో ఆమెకు నమస్కారం చేశాను. ఆమెకూడా నాకు నమస్కారం చేసింది. కాని, ముఖంలో విస్మయభావం కనపడింది....ఆమె యెప్పుడూ ఒక్కలాగే ఉంది—అదే సౌందర్యమూ, అదే సరళత్వమూ. బండి కదులుతోంది. నా రాకకు జ్ఞాపకచిహ్నంగా నే నొక కమలాఫలం తీసి బాలుని వైపు విసిరాను. అది గడ్డిమీద దొర్లిపోయింది. దాని వెనకే కుర్రాడూ, కుక్కా పరుగెత్తారు.

ఆ తరువాత నా జీవితంలో అనేక విచిత్రసంఘటనలు జరిగాయి. నే నొకసారి వ్యాపారరీత్యా రంగూను వెళ్లివస్తున్నాను. అప్పటికి యుద్ధం చాలా భయంకరంగా సాగుతోంది. దారిలో మా ఓడను జపాను వాళ్లు కొట్టారు. నాకు సముద్రంలో మునగడమూ, ఒక రోజు ఈదడమూ జ్ఞాపకం ఉన్నాయి. ఎక్కడికో దూరప్రయాణం చేసినట్లు కొంచెం కలలాగ జ్ఞాపకం ఉంది. చాలా బలహీనం అయిపోయాను. నాకు బాగా తెలిసేసరికి బొంబాయిలో నా స్నేహితుడైన ఒక వర్తకుని యింట్లో ఉన్నాను. సముద్రంలో కొట్టుకొని పోగా మిగిలిన కాగితాలలో అతని ఎడ్రసుచూసి అతనికి తెలుపగా, అతడు నన్ను తన యింటికి తీసికొని వెళ్లి చికిత్సచేయించాడు. ఆ సమయంలో నా కా నీలిమేడా, కళ్యాణీ జ్ఞాపకంవచ్చాయా అని నువ్వు అడగవచ్చు. మొట్టమొదట జ్ఞాపకం వచ్చినవే అవి. అప్పుడు నాలో నేనే—"ఈ ప్రపంచం ఎన్నాళ్లో ఎన్నో దేశాలు చూశావు. ఉన్నదానితో తృప్తిపడి ఒకచోట ఉంటే నీ కీతిప్పలు వచ్చేవి కావు! నీ అపరిచితమిత్రురాలైన కళ్యాణిలాగే సానందంగా జీవితం గడపిఉందువే! అదే శాంతి నీకూ దొరికిఉండేదే! ఒకవేళ ఆ నీలిమేడలోనే నీకూ ఇంతచోటు దొరకిఉందునేమో! సుఖం అనేది నీ నుదుట వ్రాసిలేదు. ఏం చేస్తాము!" అనుకున్నాను. మృత్యుముఖంలో ఉన్న నన్ను అశాంతి ఆవరించి మరింత బాధపెట్టింది.

చివరికి రెల్లాగో నా మిత్రుని దయవల్ల నా ప్రాణాలు నిలిచాయి. ఇంక పైన వర్తకంమాటే తల పెట్టకూడ దనుకున్నాను.

నా జీవితంలో చివరిసారి బొంబాయి-మద్రాసు దారిలో ప్రయాణం చేస్తున్నాను. ఒక్కసారి కళ్యాణి కనపడి మాట్లాడితే యెంత బాగుండును! ఆమె శాంతి సందేశం నా జీవితంలో ఎంత సుఖాన్ని కలిగిస్తూ వచ్చిందో ఒక్కసారి నేను తెలియజేస్తే ఎంత బాగుండును! రైలు రెండు నిముషాలకంటె ఎక్కువ ఆగదు. ఆ కాస్తలో అసలామె కనపడుతుందో లేదో!

స్టేషను వస్తుందనగానే బండిలోంచి తొంగి తొంగి చూడ్డం మొదలుపెట్టాను. ప్రొద్దుటియెండలో ప్రకాశిస్తూన్న ఆ నీలిమేడను చూస్తే, నా జీవితమూ, సముద్రమూ, ఓడా అన్నీ జ్ఞాపకంవచ్చాయి. రెండిటికీ ఎంత తేడా...ఆమె యింకా యిక్కడే, పూర్వంలాగే శాంతంగా, తృప్తిగా, ఆనందంగా జీవితం సాగిస్తూ ఉండిఉంటుంది. రైలు అక్కడే, ఆ యింటి ముందరే ఆగింది. వరండాలో ఒక వృద్ధురాలు జుట్టు విప్పుకుని కూర్చుని ఉంది. చుట్టూ చాలామంది పిల్లలు-మనుమలు కాబోలు-ఆడుకుంటున్నారు. ఎంత సుఖం!

కళ్యాణి! ఎవరూ ఆనవాలు పట్టలేరేమో! నేనుమాత్రం గుర్తించగలను...వెనుకటిరోజులన్నీ మనస్సులో నడిచాయి. అన్ని భిన్నరూపాలలోనూ ఒక్కటే అభిన్నత్వం...ఆ నవ్వు, ఆ శాంతీ!

నేను ఇంక ఈవైపు రానేరాను. ఇదే తుదిసారి. వెళ్లి ఆమెతో మాట్లాడడం? అవకాశం లేదే? ఏమనుకుంటుందో? అనుకునేందుకు ఏముంది? ఆ దివ్యరూపాన్ని యెప్పుడు యెల్లాగ చూశానో, భావించానో విప్పి ఒక్కసారి ముందు పెడతాను. తుదిసారి సెలవు తీసుకునేందుకు వచ్చానని చెపితే ఏమనుకుంటుంది?... కాని టైములేదే!...

ప్లాటుఫారం అంతా గందరగోళంగా ఉంది. కనుక్కుంటే ఇంజన్ చెడిపోయిందనీ, గంటవరకూ కదలదనీ తెలిసింది. భగవంతునికి కృతజ్ఞతతో ఒక్కసారి నమస్కరించాను. నీలిమేడవైపు కాళ్లు నడి

S. Leela S. Leela

చాయి. కాని కణుకుతున్నాయి. ఎల్లాగో ఆ గేటు ముందర నిలబడ్డాను. బంట్రోతు వచ్చి "ఎవరికోసం అయ్యగారూ?" అని అడిగాడు. "అక్కడ కూర్చున్న ఆ వృద్ధురాలితో మాట్లాడాలి" అన్నాను. "లోపలికి దయ చెయ్యండి. అమ్మగారితో చెప్పతా"నని బంట్రోతు వెళ్ళిపోయాడు. నాగుండెలు అతిత్వరగా కొట్టుకుంటున్నాయి.

ఆమె వచ్చింది. ఇన్నాళ్ళయిపోయినా, ఇన్ని మాటలు మాట్లాడా లనుకున్నా, నేను ఒక్కటీ అనలేక పోయాను. ఆమెయే నన్ను పలకరించి "తమ రిల్లాగ మాయిల్లు పవిత్రంచేసిన కారణం..." అంది. "మీరు నన్ను గుర్తుపట్ట లేదా?" అన్నాను. "తమ రెవ్వరూ—" అంది. "నేను మిమ్మల్ని చాలా రోజులనుంచీ బాగా యెరుగుదును. జ్ఞాపకం తెచ్చుకోండి. చిన్నప్పుడు ఒకసారి మిమ్మల్ని ఇక్కడే బంతి ఆడుతోంటే చూశాను. తరువాత మీకు జ్ఞాపకం ఉండిఉంటుంది...ఆ రైలుకిటికీలోంచి మీకు నమస్కారం చేశాను. అప్పటికి మీ వివాహం అయి ఉంటుంది. తరువాత మీ అబ్బాయికి కమలాఫలం..."

వృద్ధస్త్రీ నావైపు భయంతో చూస్తోంది. నేను తాగివచ్చాననుకుందో యేమో! కాని నా వేష భూషలూ, నా వేళ్ళ రత్నాల ఉంగరాలూ చూసి కొంచెం సమాధానపడి, "తమరు పొరపాటుపడుతున్నా రండి. మే మీయింట్లోకి వచ్చి ఒక్క సంవత్సరం మాత్రం అయింది" అంది.

నాగుండె జారిపోయింది. "అయితే మీపేరు కళ్యాణి కాదా?" అన్నాను. "ఆపేరు గలవా రెవరూ మాయింట్లోనే లేరండి!" అని ఆమె లోపలికి వెళ్లా లనుకుంటోన్నట్టు చూసింది. నాకు ఏదో కలగంటోన్నట్టు తోచింది. లేచి, "క్షమించండి, పొర పాటుపడ్డాను. అయితే,—మీకు పూర్వం ఈయింట్లో యెవ రుండేవారు?" అని అడిగాను. "మాకు ముందా?...ఒక ముసలాయన ఉండేవాడు—చిన్నప్పటి నుండీ పెళ్లిచేసుకోలేదు...అయినా, ఆయన చనిపోయి ఏడేళ్లు అయింది. ఆతరువాత మేం వచ్చేవరకూ ఇల్లు ఖాళీగా ఉంది."...నేను లేచివచ్చేశాను. నా వెనకాల ఆమె భయపడుతూ భయపడుతూ వచ్చి తోటచిన్న గేటు వేసి వెళ్లిపోయింది.

నా తల తిరిగిపోయింది. గుండెమీద ఏదో పెద్ద బరువు పెట్టినట్టు అయింది. ఇందులో ఏదో పెద్ద పొర పాటు ఉండిఉంటుంది. అదేమిటో కనుక్కునేవరకూ నాకు శాంతి ఉండదు.

స్టేషనుకు వెళ్లి, స్టేషను మాష్టర్ని అడిగాను. అతని కేమీ తెలీ దన్నాడు. చాలాకాలంనుంచీ ఆ నీలిమేడకు ఎదురుగానే ఉన్న ముసలివాణ్ణి అడిగితే తెలుస్తుం దన్నాడు.

ముసలివాడు వచ్చాడు. ఎన్నివిధాల ప్రయత్నించినా అతనికి జ్ఞాపకంరాలేదు. "పది పదిహేను ఏళ్ల క్రితం నే నామెను చూశాను. ఒక చిన్న కుర్రాడూ, ఒక పెద్ద కుక్కా...బాగా జ్ఞాపకం ఉన్నాయి." "ఉండండి, ఉండండి, పెద్దకుక్కా?...అవును... కాని, ఆమెపేరు కళ్యాణి కాదే? సరస్వతి. నాకు తెలుసు." నాకు పిచ్చెత్తిపోతోంది.

"అయినా ఉండండి. మా ముసలిదాని కేమైనా తెలుస్తుం దేమో?" అన్నాడు వృద్ధుడు. ముసలిది వచ్చింది. చూడగానే చాలా తెలివైనదనీ, మంచి జ్ఞాపకశక్తి కలది అనీ తోస్తుంది. ముసలివాడు ఆమెకు ఒక్కొక్క విషయమే చెపుతూ వచ్చాడు. "ఓహో! ఆయువతి...నాకు తెలుసును. ఆమెపేరు జమునా బాయి. కొంచెం పొడుగ్గా ఉండేది. ఎప్పుడూ జుట్టు రిబ్బనుతో కట్టుకునేది. ఇక్కడే ఒక వర్తకుని కొడుక్కి ఇచ్చారు. పాపం, అతనితో చాలాబాధలు పడింది. చివరికి వదలిపెట్టేశాడుకూడా. చాలా..."

నేను వెళ్లివస్తానని చెప్పబోయాను. రైలు ఇంకొక పావుగంటలో కదులుతుంది. "నాకు బాగా జ్ఞాపకం ఉంది. భ్రమా కాదు, ఏమీ కాదు. చిన్న పిల్లప్పుడు చూశాను. ఇప్పుడుకూడా నాకళ్లకు కట్టి నట్టుంది. ఇంకా వసంతలక్ష్మిలాగ, సీతాకోకచిలుక లాగ, నా కళ్లయెదుట ఆడుతోన్నట్టే ఉంటుంది. పేరుకు తగినట్టే ఆమె నిజంగా కళ్యాణే!" అంటూ

వృద్ధునివైపు తిరిగి, "నాకు బాగా గుర్తుంది" అంటున్నాను.

వృద్ధురాలు "ఆమాట ముందే చెప్పకపోయారా మరి? ముందు ఒక పిల్లలతల్లిని గురించి చెప్పారు. తరువాత యువతివిషయం అడిగారు. ఇప్పుడొక బాలికను గురించి మాట్లాడుకున్నారు. బాలిక అయితే నాకు బాగా తెలుసును...కళ్యాణి! అవును. అదే దాని పేరు...ఎప్పటిమాట! నలభైసంవత్సరా లవుతుంది...ముద్దులుమూటకట్టిన ట్టుండేది పాపం. వాళ్లు మాకు కొంచెం బంధువులే. పదేళ్లయినా నిండకముందే చచ్చిపోయింది అది!" అని వృద్ధురాలు కళ్లు తుడుచుకుంది. ఇంక నే నక్కడ నిలవలేకపోయాను.

...పదేళ్లవయస్సులో,—అంటే నేను చూసిన కొద్దిరోజులకే. నేనుమాత్రం నలభైసంవత్సరాలనుంచీ ఆ బాలికనుగురించి కలలుగంటూ, ఆమెనే మనస్సులో వెతుక్కుంటూ ఉన్నాను...కళ్యాణి!"

* * *

మా మామయ్య ఇంక మాట్లాడలేకపోయాడు. నాకూ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

సుశీల ఆ "వీక్లీ"లో బొమ్మలన్నీ కత్తిరించి తన పుస్తకాల అలమారుకు అతికించింది. అది చూసినప్పుడల్లా నీలిమేఘ నాకళ్లకు కట్టినట్టు జ్ఞాపకం వస్తూ ఉంటుంది.

